## అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 28 : జిల్లాకేంద్రంలోని ధర్మపురి హిల్స్ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో జూనియర్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సయ్యద్ అర్షియా ఫర్హీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాటనీ పోస్టు ఖాళీగా ఉండడంతో మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఈడీ, ఎంఎస్సీ (బాటనీ) పూర్తిచేసి, జూనియర్ లెక్చరర్‌గా మూడు సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7995057951 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## ఆత్మీయ సమ్మేళనానికి తరలిన దళితులు



జక్రాన్‌పల్లి నుంచి ఆత్మీయ సమ్మేళనానికి తరలుతున్న దళిత నాయకులు

ధర్పల్లి/ జక్రాన్‌పల్లి, అక్టోబర్ 28 : డిచ్‌పల్లి మండలకేంద్రంలోని జీ కన్వెన్షన్ హాలులో శనివారం నిర్వహించిన దళిత సంఘాల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని ఎస్సీలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దళిత సంఘాల సభ్యులు ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. సమావేశానికి రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి, పోతరాజు, సురేశ్, బాబన్న పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దళితులు డిచ్‌పల్లి మండలంలో నిర్వహించిన దళితుల ఆత్మీయ సమ్మేళనానికి పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.

## రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ధర్పల్లి, అక్టోబర్ 28 : రైతులు పీఎం కిసాన్ సంయోజన్‌కు సంబంధించిన ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్‌కు సంబంధించి రూ. 6 వేలు పొందేవారు ఆధార్ లింక్ చేయించుకోవాలని సూచించారు. హొన్నాజీపేట పరిధిలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

## ముగ్గురి బైండోవర్

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 28 : మండలకేంద్రానికి చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ ఎం.ఎ.ఖలీం తెలిపారు. ఆరు నెలలపాటు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించరాదని, మద్యం విక్రయించవద్దని, ఒకవేళ మళ్లీ పట్టుబడితే ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ. 2 లక్షల వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గిర్దావర్ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ నవీన్ పాల్గొన్నారు.

## నేడు పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం

జక్రాన్‌పల్లి/ డిచ్‌పల్లి, అక్టోబర్ 28 : డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనానికి పద్మశాలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సంఘం మండల అధ్యక్షుడు శేఖర్ కోరారు. జక్రాన్‌పల్లిలో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మాజీ అధ్యక్షులు లోలం జగదీశ్, జీఆర్.రవి, చక్రపాణి, వేణు, రాజు పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి పద్మశాలీ కులస్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని బీఆర్ఎస్ నాయకుడు శక్కరికొండ కృష్ణ ఒక ప్రకటనలో కోరారు.

## సింగారం శ్రీనివాస్‌కు డాక్టరేట్

డిచ్‌పల్లి, అక్టోబర్ 28 : టీయూ మాస్ కమ్యూనికేషన్ పరిశోధక విద్యార్థి సింగారం శ్రీనివాస్ 'రోల్ ఆఫ్ రేడియో ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ ఏ స్టడీ ఆఫ్ ఆల్ ఇండియా రేడియో నిజామాబాద్ ప్రోగ్రామ్స్' అంశంపై పరిశోధక గ్రంథాన్ని రూపొందించారు. సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య గంట చంద్రశేఖర్ పర్యవేక్షణలో దీనిని రూపొందించారు. రేడియో పాత్ర నేటికీ కీలకంగా ఉందని వివరించారు. వైవా కార్యక్రమానికి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ప్రొఫెసర్ శ్రీ రామానంద తీర్థ మరఠ్వాడ విశ్వవిద్యాలయ ఆచార్యులు దీపక్ షిండే హాజరై సిద్ధాంత గ్రంథంపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పి.శాంతాబాయి, డాక్టర్ మోహన్, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం : ఒకరి అరెస్టు

ఇందల్వాయి, అక్టోబర్ 28 : ఇందల్వాయి రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించి 470 గ్రాముల (15 ప్యాకెట్లు) ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.వేణుమాధవ్ ఆధ్వర్యంలో దాడి చేశారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లికి చెందిన షేక్ హుస్సేన్ వద్ద 470 గ్రాములు, అతడి ఇంట్లో 540 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి తక్కువ పరిమాణంలో గంజాయిని తరచూ కొనుగోలు చేసి, 5 గ్రాముల ప్యాకెట్‌ను రూ. 300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ ఫయాజ్, దత్తాద్రి పాల్గొన్నారు.

# మరోసారి దీవించండి..మరింత అభివృద్ధి చేస్తా



ప్రచారంలో భాగంగా ఓ వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా
- నగరంలో జోరుగా ఎన్నికల ప్రచారం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 28: ఇందూరు నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి దీవిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. జిల్లాకేంద్రంలోని 39, 40వ డివిజన్లలో (చంద్రశేఖర్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, గౌతంనగర్) శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అభివృద్ధి చేసే పార్టీ ఏది, అభివృద్ధిలో ముందుకు తీసుకెళుతున్న నాయకుడు ఎవరు అని ఆలోచన చేయాలని సూచించారు. ప్రజలు మరోసారి దీవిస్తే ఇందూరు నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో మేయర్ దండు నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, కార్పొరేటర్లు లతా కృష్ణ, శివ చరణ్, మాయవార్ సంతోష్, కో-ఆప్షన్ మెంబర్ చంద్రకళ, ప్రవీణ్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా...**

ఖలీల్‌వాడి/ మోస్రా (చందూర్), అక్టోబర్ 28 : ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ఇంటింటికీ తిరిగి వివరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని అన్ని డివిజన్లలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు శనివాం చేపట్టారు. నగరాన్ని అభివృద్ధి చేయించిన అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాకు మద్దతు పలుకాలని కోరారు. చందూర్, మోస్రా మండలకేంద్రాలతోపాటు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శనివారం పలు గ్రామాల్లో పర్యటించి కారు గుర్తుకు ఓటు వేసి, బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు.



జిల్లాకేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



కారేగాం లో..

## కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి, అక్టోబర్ 28 : మండల కేంద్రంలోని ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదోరోజు శనివారం నిత్యహవనం, బలిహరణం, వసంతోత్సవం, డోలోత్సవం, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కమాండెంట్ రాంప్రకాశ్ విజయలక్ష్మి దంపతులు హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కె. శ్రీనివాస్‌రెడ్డి, ప్రమోద్ జాజు, వినోద్ జాజు, అసిస్టెంట్ కమాండెంట్ సి.ఆంజనేయరెడ్డి, కె.భాస్కర్‌రావు, సి.హంసరాణి, ఆర్ఐలు పి.వెంకటేశ్వర్లు, ఎం.నరేశ్, బి.శ్యామ్‌రావు, ఆర్.ప్రహ్లాద్, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

## టీయూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నెట్‌వర్కింగ్, వెబ్ కౌన్సెలింగ్ డైరెక్టర్‌గా అరుణ

డిచ్‌పల్లి, అక్టోబర్ 28 : టీయూలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ నెట్‌వర్కింగ్, వెబ్ కౌన్సిలింగ్‌కు డైరెక్టర్‌గా అరుణను నియమించారు. టీయూ వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు నియమించినట్లు రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. అనంతరం ఆమెకు నియామక పత్రాలను అందజేశారు. అపర్ణ గతంలో పరీక్షల విభాగంలో అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

## ఘనంగా వాల్మీకి జయంతి

కోటగిరి, అక్టోబర్ 28 : ఉమ్మడి కోటగిరి మండలంలోని పోతంగల్, హంగర్గాలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. సంస్కృత సాహిత్యంలో ఆదికవి, రామాయణ మహాకావ్యాన్ని లిఖించిన జ్ఞాననిధి అని పలువురు వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 30న లక్ష మందితో కేసీఆర్ సభ

రుద్రూర్, అక్టోబర్ 28 : బాన్సువాడ పట్టణంలో ఈ నెల 30న నిర్వహించే సీఎం కేసీఆర్ సభను నియోజకవర్గ పరిధిలో లక్షమందితో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి తెలిపారు. రుద్రూర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రచారం, కొనసాగుతున్న సర్వేపై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. సీఎం కేసీఆర్ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, సీనియర్ నాయకులు అక్కపల్లి నాగేందర్, కోడె శంకర్, నర్సయ్య, మోహన్, జలీల్, కిశోర్, జమీల్, గోవింద్‌రావు, లాలేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోచారం సురేందర్‌రెడ్డి



నల్లవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సిరికొండ/ నిజామాబాద్ రూరల్/ ఇందల్వాయి, అక్టోబర్ 28 : సిరికొండ మండలంలోని మెట్టు తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ రాజేందర్, రైతులు పాల్గొన్నారు. రూరల్ మండలంలోని శ్రీనగర్, జలాల్‌పూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో మల్లేశ్, ఏపీఎం మహేశ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రవీణ్‌రెడ్డి, ఐకేపీ సీసీ సంతోష్, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లిలో సొసైటీ సీఈవో తేజాగౌడ్ ఏఈవో శ్రీహరితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ధాన్యం విక్రయించిన అనంతరం వారం రోజుల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి పిప్పెర రాజన్న, ఆపరేటర్ శ్రావణ్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.